ప్రజాశక్తి
సోమవారం 12 ఫిబ్రవరి 2024

అప్రెంటీస్ విధానం దారుణం : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నో పోరాటాలు చేసి ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్ విధానం రద్దు చేయించుకుంటే, మళ్లీ అదే విధానాన్ని జగన్ ప్రభుత్వం తీసుకు రావడాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఖండించారు. ఏ నియామకాల్లో లేని విధానాన్ని ఉపాధ్యాయ నియామకాల్లో తీసుకురావడమంటే, ఉపాధ్యాయులను వెట్టి చాకిరీలోకి నెట్టడమే అని అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకాలు రెగ్యులర్ వేతనంతో కూడివిగా ఉండాలని, చట్టాన్ని ఉల్లంఘించి నియామకాలు చేపట్టడం నియంతృత్వ ధోరణికి అద్దం పడుతుందని అన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసేంత వరకూ ఉపాధ్యాయులంతా కలిసి ఉద్యమిస్తారని, ఈ ఉద్యమంలో నిరంకుశ ప్రభుత్వాలు కొట్టుకుపోతాయని అన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

ప్రభుత్వం ప్రాధాన్యతా పనులుగా భావించిన భవన నిర్మాణాలు చాలా వరకు అసంపూర్తిగాను, పునాదుల స్థాయిలోనూ ఉండిపోయాయి. కేంద్ర ప్రభుత్వం ఏటా విడుదల చేయాల్సిన నిధులు మంజూరు చేయకపోవడం, నిధులు రాబట్టుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మెతకవైఖరి ప్రదర్శించడమే ఇందుకు ప్రధానమైన కారణాలుగా కనిపిస్తున్నాయి. చేసిన పనులకుగాను విజయనగరం జిల్లాకు సంబంధించి ప్రస్తుతం రూ.28కోట్ల మేర బకాయి రావాల్సివుంది. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ రూ.10కోట్ల వరకు విడుదల కావాల్సి వున్నట్టు సమాచారం.

నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన సచివాలయ భవనం

- రూ.28 కోట్ల మేర బకాయి
- మరో రూ.100కోట్లు ఉంటే తప్ప పూర్తికాని పరిస్థితి
- మంజూరుకు నోచుకోనివి మరికొన్ని
- ఇదీ ఐదేళ్ల పాలనలో మెటీరియల్ కాంపొనెంట్ నిధుల వినియోగం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా ఏటా చేపడుతున్న పనిదినాలు, వాటిపై విడుదల అవుతున్న నిధులపై కొంతశాతం మెటీరియల్ కాంపోనెంట్ పనులకు కేటాయించాల్సి ఉంది. వైసిపి అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు వంటి వ్యవస్థలు ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ఆయా భవనాలు నిర్మాణానికి మొదటి ప్రాధాన్యతగాను, రోడ్లకు రెండో ప్రాధాన్యతగాను ఖర్చుచేసేందుకు నిర్ణయించింది. రెండో ప్రాధాన్యతకు పెద్దగా నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామీణ రహదారులు అస్తవ్యస్థంగానే ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా 530 గ్రామ సచివాలయాలు ఉండగా వీటిలో 498 సచివాలయ భవనాలు, 496 రైతు భరోసా కేంద్రాలకుగాను 291 భవనాలు, 311 వెల్‌నెస్ సెంటర్లకుగాను 178 పూర్తి భవనాలు నిర్మించాలని 2019లోనే ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుంది. ఉపాధి కూలీలు చేస్తున్న పని, వాటికి చెల్లింపులను బట్టి విజయనగరం జిల్లాలో సుమారు రూ.300కోట్లకుపైగా మెటీరియల్ కాంపొనెంట్ నిధులు విడుదల చేయాలి. కానీ, అరకొరగా విడుదల చేయడం వల్ల మిగిలిన నిధులు రద్దుకావడంతోపాటు చేసిన పనులకు బిల్లులు రాక, సంబంధిత భవన నిర్మాణాల కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే నిలిపివేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పై లెక్కలను బట్టి ఇప్పటి వరకు కేంద్రం నుంచి రూ.1500కోట్ల మేర విడుదల చేయాల్సి వున్నప్పటికీ, గ్రామ సచివాలయాలకు రూ.130కోట్లు, రైతు భరోసా కేంద్రాలకు రూ.60కోట్లు, విలేజ్ హెల్త్‌క్లీనిక్ భవనాలకు రూ.50కోట్ల చొప్పున కేవలం రూ.240కోట్లు మాత్రమే విడుదల చేసింది. వీటికి సంబంధించి రూ.28కోట్ల మేర బకాయి ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మొత్తం పనులు పూర్తికావాలంటే మరో రూ.100కోట్ల వరకు అవసరమని సమాచారం. దీంతో, 123 గ్రామ సచివాలయాలు, 126 రైతు భరోసా కేంద్రాలు, 133 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు చొప్పున మొత్తం 382 భవన నిర్మాణాలు రూఫ్‌లెవెల్, గోడలు, పునాదుల స్థాయిలో నిలిచిపోయాయి. చాలా వరకు ఏళ్ల తరబడి మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. మరో 32 గ్రామ సచివాలయాలు, 79ఆర్‌బికెలు, 124 విలేజ్ హెల్త్‌క్లీనిక్‌ల చొప్పున ఈ మూడు విభాగాలకు చెందిన 235 భవనాలకు కనీసం ప్రతిపాదనలు కూడా లేవు.

పార్వతీపురం జిల్లా వ్యాప్తంగా 311 గ్రామ సచివాలయ భవనాలకు గానూ, 253భవనాల పనులు ప్రారంభించగా, 125 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. 301 ఆర్‌బికె భవనాలకు గాను, 178 నిర్మాణాలు చేపట్టగా, 100 మాత్రమే పూర్తయ్యాయి. 192 విలేజ్ క్లినిక్ భవన సముదాయాలు చేపట్టగా ఇందులో చాలా వరకు అసంపూర్తిగా ఉన్నాయి. మొత్తం భవన నిర్మాణాలకు సంబంధించి రూ.10కోట్ల వరకు బకాయి ప్రభుత్వం నుంచి రావాల్సివున్నట్టు సమాచారం. ఈ రెండు జిల్లాల్లో సచివాలయ, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాల బకాయిలు సంక్రాంతిలోపే చెల్లిస్తామని, పనులు ముమ్మరం చేయాలంటూ జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పంచాయతీరాజ్ శాఖ అధికారులకు హామీ ఇచ్చినప్పటికీ, ఆ మాట ప్రకారం నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రచయిత గంటేడ గౌరునాయుడు

సాహితీ లోకానికి మాస్టారు 'కారా'

కారామాష్టారు కథలతో కొద్దిసేపు ముచ్చట్లలో కవులు, రచయితలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

'భగవంతుడికి జనం నమస్కరిస్తారు. ఆ భగవంతుడు మనిషిగా మారితే అప్పుడు కూడా అందరూ అతనికి నమస్కరిస్తారని అందరికీ తెలిసిన విషయమే. అయితే, దేముడు మానవుడైతే అప్పుడు అతనైనా సరే కాళీపట్నం రామారావుకు నమస్కరించి తీరవలసిందే!. రామారావు గారి వంటి సజ్జనుడి సాంగత్యం లభించడం నా అదృష్టం. ఆయన లాంటి గొప్ప కథకులుండటం మన జనం అదృష్టం.' అంటూ రాచకొండ విశ్వనాథశాస్త్రి, యజ్ఞం కథాసంపుటి ముందు మాటగా 1971లో రాసారని సాహితీ ప్రముఖులు, కవులు, రచయితలు తెలిపారు. నేటి ఆధునిక కాలంలో కారా మాష్టారు రచనలు సాహితీ ప్రపంచానికి దిక్సూచని, సాహితీ లోకంలో అందరికీ మాస్టారు కారా మాస్టారు అని కొనియాడారు.

ఆదివారం పార్వతీపురంలో స్నేహకళాసాహితీ ఆధ్వర్యంలో కారా మాస్టారి కథలతో కొంతసేపు సాహితీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కథా దీపధారి కాళీపట్నం రామారావు మాస్టారు శతజయంతి సంవత్సరం, కథానిలయం వార్షికోత్సవ సందర్భంగా ఉత్తరాంధ్రలో అన్నిచోట్ల ఆదివారం సాహితీ సమావేశాలు జరగ్గా పార్వతీపురంలోని గిరిజన్ భవన్ లో సాహితీవేత్త గోపాలరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ప్రముఖ రచయిత గంటేడి గౌరీ నాయుడు, ఆముదాలవలస సాహితీ స్రవంతికి చెందిన పివిఎన్ మూర్తి, సహజ సాహితీ సాంస్కృతిక సంస్థకు చెందిన ఎన్‌కె బాబు, శ్రీకాకుళం సిక్కోలు బుక్ ట్రస్టుకు చెందిన రచయిత, వక్త దుప్పల రవికుమార్, రాజాం రచయితల సంఘానికి చెందిన రచయిత పొదిలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కారామాస్టారి సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని, నిబద్ధతను వివరించారు. రచయిత, కథకుడు, విమర్శకుడైన కారా మాస్టారు రచనలశైలి సరళంగా ఉంటుందన్నారు. ఆయనరాసిన యజ్ఞం ఆధునిక తెలుగు సాహిత్యంలో కన్యాశుల్కంతో సమానమైనదన్నారు. కారా భౌతికంగా లేకపోయినా ఆయన కథలు, రచనలు, ఆయన ఏర్పాటుచేసిన కథానిలయం చిరకాలం ఉంటాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాల్లోని మురపాకలో పుట్టి విశాఖలో లెక్కల మాస్టారుగా పనిచేసిన కారామాస్టారు సాహితీ ప్రపంచంలో అందరికీ మాస్టారని తెలిపారు. కార్యక్రమంలో రచయితలు శాంతి, కుమార్ వర్మ, జగదీష్, పక్కి రవీంద్ర, స్వామి నాయుడు, చిన్నంనాయుడు, సోమేశ్వర రావు, గణపతిరావు, రంజిత్ కుమార్, సత్యనారాయణ, గోవింద, బూరి ఇళ్ళంనాయుడు, పాలకొండ రామలింగ స్వామి, పిల్లా లక్ష్మున్నాయుడు, పిల్లా తిరుపతిరావు తదితరులతో పాటు శ్రీకాకుళం సాహితీ అరసం, సాహితీలహరి, జనవిజ్ఞాన వేదిక, స్నేహకళాసాహితీలకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన కథలు, సాహిత్యం గురించి వివరించారు.

చిన్నారులతో కలిసి నృత్యం చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పాఠశాల వార్షికోత్సవంలో డిప్యూటీ సిఎం నృత్యం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని ఆర్‌సిఎం హైస్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం రాజన్నదొర విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో భాగంగా తొలుత డిప్యూటీ సీఎం రాజన్నదొర, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు లుంగీ డాన్స్, లుంగీ డాన్స్ అనే పాటకు నృత్యం చేశారు. ఉత్సాహం ఆపుకోలేక విద్యార్థులతో కలిసి ఆయన కూడా స్టెప్పులేశారు. దీంతో విద్యార్థులు రెట్టింపు ఉత్సాహంతో ఉరకలేశారు. కార్యక్రమంలో టౌన్ సిఐ జిడి బాబు, ప్రముఖులు హాజరయ్యారు.

13న నడుకూరులో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరులో ఈనెల 13న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైద్య , సచివాలయ సిబ్బంది సమయం పాటించి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సంబరాలు సరే.. డబ్బులేవీ?

ఆసరా డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ మహిళల ప్రదక్షిణలు



వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు (ఫైల్)

ప్రజాశక్తి- పార్వతీపురం

మహిళలను మహారాణులను చేస్తామంటూ.. వైఎస్ఆర్ ఆసరా పేరుతో బ్యాంకులో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూ.. నాలుగు విడతల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2019 ఏప్రిల్ 17వ తేదీ వరకు స్వయం సహాయ సంఘాలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తానని ప్రతిపక్ష నేతగా జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని నాలుగు విడతలకు గాను మూడుసార్లు బ్యాంకుల్లో నగదు జమచేశారు. జగన్ ప్రభుత్వం హామీ మేరకు నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కింద నిధులను గత నెల 23న అనంతపురం జిల్లా ఉరవకొండలో భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి స్వయంగా బటన్ నొక్కి, విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు జిల్లాల వారీగా మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలకు మెగా చెక్కులు అందజేశారు. అనంతరం మండలాల వారీగా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సభలు ఏర్పాటు చేసి, చెక్కులు పంపిణీ చేశారు. నాటి నుంచి నేటి వరకు స్వయం సహాయక సంఘాల మహిళలు ఆసరా డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

20 రోజులైనా..

వైఎస్ఆర్ ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడతలో జిల్లాలో 16669 సంఘాల పరిధిలోని లక్షా 83,077 మంది డ్వాక్రా మహిళలకు రూ.94.33 కోట్లు నిధులు విడుదల చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వయం సహాయక సంఘాల మహిళల వ్యక్తిగత ఖాతాల్లో ఆ డబ్బులు జమచేస్తున్నట్లు జనవరి 23న బటన్ నొక్కారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేసి జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేశారంటూ గొప్పలు చెప్పుకున్నారు. డబ్బులు మాత్రం మహిళల ఖాతాల్లో జమకాక స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆసరా పేరిట ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ పొందేందుకు బ్యాంకు వరకు వచ్చే పోయేందుకు మూణ్నాలుగు వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని అక్కచెల్లెమ్మలు వాపోతున్నారు. జిల్లాలో నేటికీ 20 శాతం దాటి రాలేదని సంఘాల మహిళలు వాపోతున్నారు దీంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ప్రభుత్వ రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారా? లేదా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఉద్యమాలకు విరాళాలు ఇవ్వండి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా సమస్యలపై సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమాలకు విరాళాలిచ్చి అండగా నిలవాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు కోరారు. పట్టణంలో ఆదివారం సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు, కార్మికులు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరగడంతో అన్ని వర్గాల ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. ఆస్తిపన్ను, చెత్తపన్ను వంటి భారాలు వేస్తున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలు ఇచ్చే ఎలక్ట్రోల్ బాండ్లను తీసుకోకూడదని సిపిఎం తీర్మానం చేసి ఎన్నికల కమిషన్‌కు కూడా తెలియజేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై పని చేస్తున్న సిపిఎంకు ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారాలు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పాచిపెంట

పాచిపెంట నుండి మాతుమూరు వరకు మంజూరైన రూ.4కోట్లు బిటి రోడ్డుకు ఆదివారం ఎంపిపి బి.ప్రమీల శంకుస్థాపన చేశారు. రోడ్డు మంజూరుకు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ప్రత్యేక చొరవ చూపించారని ఆమె అన్నారు. ఆర్ అండ్‌బి డిఇ సుబ్బారావు మాట్లాడుతూ స్థానిక పెట్రోల్ బంకు నుంచి మాతుమూరు వరకు ఎనిమిది కిలోమీటర్ల బిటి రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4కోట్లు మంజూరు చేసిందని, రోడ్డు నిర్మాణంలో భాగంగా రెండు చోట్ల 650 మీటర్లు సిసి రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించనున్నట్టు డిఇ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, ఆర్ అండ్ బి జెఇ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో దేశీ ఆవు ప్రాముఖ్యత ఎక్కువ

రైతు సాధికార సంస్థ సీనియర్ సలహాదారు డాక్టర్ పారి నాయుడు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రకృతి వ్యవసాయంలో దేశీ ఆవు ప్రాముఖ్యత చాలా ఎక్కువని రైతు సాధికార సంస్థ సీనియర్ సలహాదారు డాక్టర్ డి.పారినాయుడు అన్నారు. మండలంలో తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం బడి నుండి పొలం బడికి పాఠ్యాంశాల రూపకల్పనలో భాగంగా రచయితల వర్క్ షాప్ పారినాయుడు అధ్యక్షతన జరిగింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మార్గదర్శకాల ప్రకారం రెండో తరగతి విద్యార్థులకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయ పాఠ్యాంశాల రూపకల్పన జరుగుతోందన్నారు. అందులో భాగంగా ఆదివాం ప్రకృతి వ్యవసాయంలో దేశీ ఆవు - ప్రాముఖ్యత పై ప్రముఖ రచయిత, దర్శకులు, నటులు రౌతు వాసుదేవరావు రాసిన గేయాలు, కథలను ముందుగా సమీక్షించారు. ఆవు, దాని ఉత్పత్తులు, వాటి ఉప ఉత్పత్తులు, వ్యవసాయంలో వాటి ఆవశ్యకత, వినియోగంపై రాసిన గేయాలను, కథలను ఎన్‌సిఆర్‌టి మార్గదర్శకాలకు అనుగుణంగా సరళమైన భాషలో, అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యే రీతిలో ఉండేలా అవసరమని అన్నారు. ఈ మేరకు ఇతర రచయితల అభిప్రాయాలను తీసుకుని సవరణలు చేశామన్నారు. ప్రకృతి వ్యవసాయంలో అన్ని రకాల పోషకాలు అందివ్వడం, వివిధ రకాల ఎరువులు, కశాయాల తయారీలో ఆవు, ఆవు యొక్క వివిధ ఉత్పత్తుల ప్రాధాన్యత చాలా ఉందని అన్నారు. ఇది అన్ని ప్రాంతాల, అన్ని వయస్సుల వారికి ఉపయోగ పడుతుందని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెలగాం భీమేశ్వరరావు మట్టి రకాలు, నీటి వనరులు, దేశీ విత్తనాలు అన్న అంశాలపై రాసిన గేయాలు, కథలను సమీక్షించామని, బాల సాహిత్యంలో విశేష అనుభవం గల భీమేశ్వర రావు సరళమైన భాషలో అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యేలా పద ప్రయోగం చేసి రాసిన ఈ పాఠ్యాంశాలు రెండో తరగతి విద్యార్థులకు అనువుగా ఉన్నాయని అన్నారు. 10 మంది రచయితల సమక్షంలో సమీక్షించడం వల్ల సారాంశంలో ఎటువంటి లోపాలు లేకుండా చూడగలుగుతున్నామని పారి నాయుడు తెలిపారు. భావితరాలకు, బాలలకు ఈ పాఠ్యాం శాలు చాలా ఉపకరిస్తాయని, వారు తినే ఆహారం ఎలా వస్తుందో తెలుసుకునే అవకాశం బాల్యంలోనే కలుగుతుందని అన్నారు. ఇలా తెలుసుకోవడం ద్వారా వారి నైపుణ్యాలు పెరిగి సురక్షితమైన ఆహార ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. తద్వారా భవిష్యత్‌లో ఆహార కొరత ఏర్పడకుండా చేయగలదని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. బడి నుండి పొలం బడికి సిలబస్ డెవలప్మెంట్ కన్సల్టెంట్ తుంబలి శివాజీ ఈ గేయాలకు, కథలకు అనువైన చిత్రాలను గీసి ఆకర్షణ కల్పించారు. కార్యక్రమంలో రౌతు వాసుదేవరావు, బెలగాం భీమేశ్వర రావు, తుంబలి శివాజీ, బెహరా ఉమామహేశ్వరరావు, పక్కి రవీంద్ర నాథ్, లంకా వెంకట స్వామి, ద్వారపు రెడ్డి దనుంజయరావు, శ్రీరామచంద్ర మూర్తి, కిలపర్తి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న రచయితలు

ఏజెన్సీలో విచ్చలవిడిగా సారా

- ప్రభుత్వ మద్యం... ప్రైవేట్ షాపుల్లో లభ్యం
- అధికారుల అండతో అమ్మకాలు
- పట్టుబడ్డ వారంతా పాత నేరస్తులే

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో ప్రభుత్వ మద్యం ప్రైవేటు షాపుల్లో విచ్చలవిడిగా లభిస్తోంది. కొంత మంది బెల్ట్ షాపు యజమానులు ప్రభుత్వ వైన్ షాపుల వద్ద మద్యం బాటిల్ పెద్ద ఎత్తున కొనుగోలు చేసి గ్రామాల్లో అధిక ధరలకు అమ్ముతున్నారు. గత కొన్నేళ్లుగా గ్రామాల్లో ప్రభుత్వ మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నా అధికారులు ఉదాసీనం వ్యవహరించడంతో మూడు పువ్వులు, ఆరుకాయలుగా బెల్టుషాపులు విస్తరిస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులకు మామూళు ముట్టజెప్పడంతో ప్రైవేటు వర్తకులు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా అధిక ధరలకు మద్యం అమ్మి, ప్రజల నుంచి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట ప్రభుత్వ మద్యం దుకాణం షాపు పక్కనే ప్రైవేట్ వర్తకుడు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ మద్యం అక్రమంగా అమ్మకాలు చేపడుతూనే ఉన్నాడని గ్రామస్తులు అధికారులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు స్పందించిన టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో భారీ మొత్తంలో మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఇదే వ్యక్తి గత ఏడాది ప్రభుత్వ మద్యం అమ్ముతూ పట్టుబడి ఒకసారి జైలుకు వెళ్లినా మళ్లీ మద్యం అమ్మకాలు కొనసాగిస్తూనే ఉన్నాడు.

గ్రామాల్లో అవగాహన కల్పించాలి

గ్రామాల్లో మద్యం, నాటుసారా విచ్చలవిడిగా లభ్యమవుతున్న నేపథ్యంలో ఎక్కువ మంది నాటు సారా మద్యానికి బానిసై కుటుంబం ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమవుతుంది. ఎక్కువ మంది యువత ఈ వ్యసనాలకు బానిసవుతున్నారు. కావున గ్రామాల్లో మద్యం నాటుసారా నివారణకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మూలించాలి. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ మద్యంతో ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన వ్యక్తి

నేడు రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్‌దారుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక రైతు బజార్ వద్ద ఉన్న రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్‌దారుల మందిరంలో ఉదయం 10 గంటలకు పెన్షన్‌దారుల సమావేశం ఉందని, ఈ సమావేశానికి పెన్షన్‌దారులంతా హాజరు కావాలని అన్నారు. ఈనెల 29 వరకు లైఫ్ సర్టిఫికెట్లు చేయబడునని రిటైర్డ్ పెన్షన్ దారుల అసోసియేషన్ కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఉపేంద్ర అన్నారు. ఆదివారం గుమడ సంతలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఉపేంద్ర, సాంబమూర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జెఎసి ఉమ్మడిగా పిలుపునిచ్చాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కార్మిక, రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగులకు తీసుకెళ్లి బిజెపి అవలంభిస్తున్న కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న ఎన్నికల్లో ఈ విధానాలను వ్యతిరేకించాలని, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

శంఖారావ సభను విజయవంతం చేద్దాం: కిడారి

ప్రజాశక్తి–పాలకొండ

ఈ నెల 13న పాలకొండ నియోజకవర్గంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగే శంఖారావం సభ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అరకు పార్లమెంట్ అధ్యక్షులు, మాజీమంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం శంఖారావం సభ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి, భవిష్యత్ కోసం చేపట్టే శంఖారావ సభ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో నిరుద్యోగులకు, రైతులకు, కార్మికులకు, ఉద్యోగులకు మోసం జరిగిందని, వైసిపి ప్రభుత్వానికి ప్రజల సొమ్ము దోచుకోవడం తప్ప సంపద సృష్టించే ఆలోచన లేదని విమర్శించారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, నారా చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అవుతున్నారని అన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అధ్యక్షతన మంగళవారం పాలకొండలో జరిగే శంఖారావం సభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గొట్టిముక్కల కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు కిమిడి కాశింనాయుడు, పాలవలస కన్నబాబు, జి.గౌరినాయుడు, శంకరాపు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : కురుపాం నియోజకవర్గంలో ఈనెల 13న జరిగే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ పిలుపు ఇచ్చారు. ఆదివారం శంఖారావం జరుగు సభ స్థలాన్ని పరిశీలించి అనంతరం చినమేరంగి కోట వద్ద నియోజకవర్గ టిడిపి నాయకులతో

సాలూరు : సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న సభను జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో నియోజక వర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్, రాష్ట్ర బిసి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి దొంకాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : పాలకొండ మండలంలోని రాజుపేట గ్రామ సమీపంలో ఈనెల 13న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఆటో ద్వారా ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

రోగులకు తనిఖీలు చేస్తున్న జగన్మోహనరావు

ప్రాథమిక చికిత్స పట్ల అప్రమత్తం : డిఎంఒ

ప్రజాశక్తి - సీతానగరం

అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందజేయడంలో ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిఎంఒ డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు స్థానిక పిహెచ్‌సిని సందర్శించి పలు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన వారి చికిత్స వివరాలు రికార్డులో తనిఖీ చేశారు. అందుబాటులో ఉంచిన మందులు, పరికరాలు పరిశీలించారు. అదే సమయంలో ఆసుపత్రికి వచ్చిన వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని స్వయంగా ఆయన తనిఖీ చేశారు. వారికి తగు సూచనలు చేసి వైద్య సిబ్బందికి మందులు అందజేశారు. పిహెచ్‌సి ప్రధాన రహదారికి సమీపాన ఉన్నందున అత్యవసర చికిత్స అవసరమైన వారు వస్తుంటారని, కావున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోడ్ ప్రమాదాలు, కుక్కకాటు, పాముకాటు, జ్వరలక్షణాలు, ఇతరత్రా అత్యవసర అనారోగ్య సమస్యలకు గురైన వారికి అవసరమైన చికిత్స పిహెచ్‌సిలో సిద్ధంగా ఉంచాలన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గణేశ్వరరావు

గర్భిణులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని గుమడాంలో గల గిరిజన గర్భిణీ స్త్రీల వసతి గృహంలో ఆదివారం మీ సేవకై మేము సంస్థ, శ్రీ గౌరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.గణేశ్వరరావు గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తూ ఆరోగ్య సలహాలు సూచనలు చేశారు. మాతృత్వం అనేది ప్రతి మహిళకు గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఇప్పిలి దిలీప్ కుమార్, వైటిసి మేనేజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

గుమడలో ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

విశాఖ నుంచి రాయగడ మధ్యలో గుమడ, కూనేరు రైల్వే స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపివేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఆదివారం ఆంధ్రా –ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కెరడాలో ఏర్పాటు చేసిన బిజెడి సమావేశంలో మాజీ ఎంపి నక్కింట భాస్కరరావుకు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ కూనేరు రైల్వే స్టేషన్లో గుంటూరు రాయగడ ఎక్స్రెస్ రైలు నిలిపివేయాలని, అలాగే విశాఖపట్నం నుండి రాయపూర్ రైలును పాత పద్ధతిలోనే పునరుద్ధించాలని కోరారు. గుమడ రైల్వే స్టేషన్‌లో ఇంటర్‌సిటీ, కోర్బా, నాగావళి, బొకారో, యశ్వంత్‌పూర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌లు ఇవ్వాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో అరకు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, పాల్గొన్నారు.

దళితవాడలో అన్నీ సమస్యలే..!

● మృతదేహాలను తీసుకెళ్లేందుకూ తప్పని అవస్థలు ● రహదారికి ఇరువైపులా కాలువలు లేక ఇబ్బందులు ● విద్యుత్ స్తంభాలూ లేకపాయే ● ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం

ప్రజాశక్తి - వీరఘట్టం

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం పని చేస్తుందని పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారు తప్ప తమకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు దళితులు ఆరోపిస్తున్నారు. స్వాతంత్ర్య వచ్చి 75ఏళ్లు పూర్తయినప్పటికీ దళిత వాడల్లో సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయంటే పాలకుల పనితీరు ఏ విధంగా ఉందో వీటిని చూస్తూనే అర్థం చేసుకోవచ్చు. మండలంలోని రేగులపాడు సచివాలయ పరిధిలోని బొడ్లపాడు ఉంది. ఈ గ్రామంలో సుమారు 75 కుటుంబాలకు చెందిన దాదాపుగా 300 మంది దళితులు నివాసం ఉంటున్నారు. ఈ దళితవాడలో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కరించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్మశానానికి రహదారి సౌకర్యం లేక అవస్థలు

తమ వీధిలో ఏ ఒక్కరు మృతి చెందినా శ్మశాన వాటికకు

ఆక్రమణకు గురైన శ్మశానవాటిక

తరలించేందుకు కనీసం రహదారి సౌకర్యం లేకపోవడంతో మృతదేహాలను తీసుకువెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని దళితులు చెబుతున్నారు. వర్షాకాలంలో మృతదేహాలను తీసుకెళ్లేందుకు బురదలో నుంచి పంటలను తొక్కుకొని శ్మశానవాటికకు మృతదేహాలను తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని దళితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా దళితులకు కేటాయించిన శ్మశాన వాటిక క్రమేపీ కబ్జాకు గురవుతుంది. శ్మశాన వాటిక చుట్టుపక్కల ఉన్న పెత్తందారులు ప్రతిఏటా కుదించుకుపోతున్నారని, ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో శ్మశాన వాటిక కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక మనిషి మృతదేహం పూడ్చాల్సిన పరిస్థితి దాపురుస్తుందని దళితులు ఆరోపిస్తున్నారు. దళితుల కోసం ప్రభుత్వం కేటాయించిన శ్మశాన వాటిక ఇప్పటికే కనుమరుగైపోతుందని దళితులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ సౌకర్యం కోసం ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

గ్రామంలో మూడు దళిత వీధుల్లో పది విద్యుత్ స్తంభాలున్నాయని,అదనంగా మరో నాలుగు స్తంభాలు ఏర్పాటు చేయాలని పాలకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని దళితులు ఆరోపిస్తున్నారు. స్తంభాలు ఉన్నప్పటికీ వీధి దీపాలు రెండు నెలల నుంచి వెలగడంలేదని, గృహాలు, పంట పొలాలకు దగ్గరగా ఉన్నందున విష సర్పాలు గృహాల్లోకి ప్రవేశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ పాలకవర్గానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలువల్లేక అవస్థలు

దళితవాడలో సిసి రహదారులు నిర్మించినప్పటికీ గృహాలకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షాకాల సమయంలో వర్షపు నీరంతా

కనీస సౌకర్యాలకు నోచుకోని దళితవాడ

రోడ్డుపై నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్నామని దళితులు చెబుతున్నారు. అలాగే ఒక వీధిలో కాలువ ఉన్నప్పటికీ గత కొంతకాలంగా ఆ కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోయి రోడ్డుపైకి మురికినీరు వస్తుందని తెలిపారు.

లీకులు అరికట్టించేందుకు చర్యలు తీసుకోవాలి

గ్రామానికి వండవ ఉపరితల రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ పొన్నాడ వాసుదేవరావు ఇంటి వద్ద పైప్‌లైన్ లీక్ కావడంతో తాగునీరు వృథాగా పోవడంతో రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో తాగునీరు అరకొరగా అందడంతో అవస్థలు పడుతున్నట్లు దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలోనూ, వీరఘట్టంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకవర్గం స్పందించి దళితవాడలో సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని దళితులు కోరుతున్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కొట్టలపాడులో గుడ్ మార్నింగ్ సీతంపేట

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనుల మనుగడే లక్ష్యంగా చేసుకుని ప్రతి గిరిజనుడి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్దాం అని గుడ్ మార్నింగ్ సీతంపేట కార్యక్రమం మండలంలోని కిట్టలపాడు, సవర గొయిది గ్రామాల్లో మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొకలింగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యం చేసిన ఈ నయవంచక పాలనను తరిమి కొట్టే వరకూ ఈ గుడ్ మార్నింగ్ సీతంపేట కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో మరింత సూపర్ సిక్స్ పథకాలు చేరేలా కృషి చేయాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామాల్లోని సమస్యలు తెలుసుకున్నారు. వాటిని తీర్చే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి కో–ఆర్డినేటర్ ఇమరక పవన్, మాధవ్, మిన్నరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎంవిఆర్ పురం, చిదిమి , కంబర, దశమంతపురం తదితర గ్రామాల నుంచి తరచుగా కలప అక్రమ రవాణా సాగుతుంది. ఈ మేరకు స్థానిక ఎస్ఐ ఎం.గోవింద్ నిఘా పెట్టారు. ఇందులో భాగంగా ఆదివారం ట్రాక్టర్‌తో తరలిస్తున్న కలపను అడ్డుకున్నారు. కలపకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో అక్రమ రవాణాదారులపై ఎస్ఐ ఆగ్రహించారు.

టిడిపిదే అధికారం : కళా

ప్రజాశక్తి–పాలకొండ

రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కళావెంకట్రావు అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణతో కలిసి చైతన్య రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పటం తథ్యమన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్, నాయకులు కర్నేన అప్పలనాయుడు, సుంకర అనిల్, అంపోలు శ్రీను తదితరులు ఉన్నారు.

మొండివైఖరి వీడకపోతే మూల్యం చెల్లించుకోవాల్సిందే

ప్రజాశక్తి –పార్వతీపురంరూరల్

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికుల పట్ల ప్రభుత్వం కపట వైఖరి ప్రదర్శిస్తోందని, అందుకు తగిన మూల్యం త్వరలోనే చెల్లించుకోవాల్సి వస్తుందని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నాలుగేళ్లుగా వీరికి రావాల్సిన బకాయిలు విడుదల చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. ఇది సరి కాదని భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకార సమయంలో తమది ఉద్యోగుల ప్రభుత్వమని, ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పి మాట తప్పారన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి మినీ డీఎస్సీతోనే సరిపెట్టు తున్నారని విమర్శించారు. ఇప్పుడు అప్రెంటీస్ విధానాన్ని పునరుద్ధరిస్తామంటే ఒప్పుకోమన్నారు.

పార్కులో సందడే సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. వేసవి ప్రారంభం కావడంతో పర్యాటకులు కాసేపు సేద తీర్చుకుందామని వేసవి విడిది చేద్దామని పార్కులో పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తున్నారు. పార్కులోని అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాల ఊగారు. చిన్నారులు కమాండ్ నెట్ ఎక్కి సరదాగా ఆడుకుంటారు. మినీ ట్రైన్ ఎక్కి ఎంచక్కా ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించారు.

డివైడర్ మధ్యలోనే కూరగాయల మొక్కలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి నుండి ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్ మధ్యలో తోటకూర, మెంతుకూర, ఆకుకూరలు, టమాటా, వంగ, తదితర కూరగాయల మొక్కలు పెరుగుతున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి ఏపుగా పెరిగి ఫలసాయాన్ని అందిస్తున్నాయి. అప్పటిలో డివైడర్ మధ్యలో వేసిన మొక్కలు పర్యావరణానికి ముప్పు అని గత ఏడాది నవంబర్ 7న డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలను తొలగించి వాటి స్థానంలో సుందరీకరణ పనులలో భాగంగా రూ.4 లక్షల

డివైడర్ మధ్య వెలసిన కూరగాయల మొక్కలు

90వేల అంచనాలతో మున్సిపల్ సాధారణ విధుల నుంచి సంబంధిత కాంట్రాక్టర్ మొక్కలను వేసి డివైడర్ కిరువైపులా కొంత మేరకు మాత్రమే రైలింగ్‌ను ఏర్పాటు చేసి నిధులు చాల్లేదని పనులు నిలిపివేశారు. దీంతో రహదారిపై కూరగాయలు వ్యాపారం చేసుకునే విక్రయదారులు డివైడర్ మధ్యలో కూరగాయల వ్యర్థాలను వెదజల్లడంతో వాటి విత్తనాలు మొక్కలుగా మొలిచాయి. ఇంత జరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో స్థానికులు అధికారుల నిర్లక్ష్య ధోరణిపై బహిరంగగానే విమర్శిస్తున్నారు.

కవల పిల్లలకు జన్మనిచ్చిన జ్యోతి

నాలుగో ప్రసవం.. కవలలు జననం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ కేదారలంక గిరిజన గ్రామానికి చెందిన కొండ గౌర్రె జ్యోతి (24) పురిటి నొప్పులతో బాధపడుతుండగా బంధువులు నీలకంఠాపురం పిహెచ్‌సికి ఆదివారం తీసుకొచ్చారు. వైద్యాధికారి అభినవ్ కుమార్ ముందుగానే కవల పిల్లలు ఉన్నారని గ్రహించి నార్మల్ డెలివరీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చిందని, మగ బిడ్డ 2 కేజీల 25 గ్రాములుండగా ఆడబిడ్డ 2 కేజీలు ఉందని తెలిపారు. జ్యోతికి ఇది నాలుగువ ప్రసవమని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె బంధువులు మాట్లాడుతూ ఇంతకుముందు తమ ప్రాంతంలో మహిళ పురిటి నొప్పులతో బాధపడితే పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లమని, కానీ ఇప్పుడు నీలకంఠాపురం పిహెచ్సిలో వైద్యాధికారులు గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని అభినందించారు. అలాగే ప్రతి గ్రామంలో తిరుగుతూ మెడికల్ క్యాంపులు పెడుతూ వ్యాధులపై అవగాహన, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ మునమ్మ, ఏఎన్ఎం జానకి, జ్యోతి , ఆశా కార్యకర్త సిహెచ్‌డబ్ల్యు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కురుపాం

తోటపల్లి వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ గోడ పత్రికను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చినమేరంగి తన అతిథి గృహంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20న తోటపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం జరుగుతుందని, కావున భక్తులంతా గమనించి పెద్ద ఎత్తున కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి సూర్యనారాయణ, ప్రధాన ఆలయ అర్చకులు అప్పలాచార్యులు, పాలకమండలి చైర్మన్ ఎం.సత్యనారాయణ, బోర్డు డైరెక్టర్ పాత్రో, టీటీడీఎస్ మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయనాయుడు, కన్వీనర్ శ్రీరామచంద్రమూర్తి, ట్రస్టీ బలరాంనాయుడు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో చినబోగిలిలో ఆదివారం ఎస్సై ఎం.రాజేష్ వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక వాహనం పత్రాలు ఉండాలన్నారు. ఆటో ప్రయాణంలో పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, హెల్మెట్ ధరించాలని తెలిపారు. దీంతో రోడ్డు ప్రమాదాలను నివారిం చవచ్చు న్నారు. పాత చలాన్ల బకాయి లుంటే తక్షణమే చెల్లిం చాలన్నారు. తనిఖీలో పోలీసులు సంపత్ కుమార్, రామకృష్ణ ఉన్నారు.

పొలాల్లోకి వెళ్లేందుకు తోవ కల్పించండి

ప్రజాశక్తి - పాచిపెంట

పెద్దగెడ్డ నిర్వాసితులైన మడవలస, తురాయిపాడు గిరిజనులకు అడవి పోడు భూములు సాగు చేసుకొనేందుకు తోవలు కల్పించాలని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పెద్దనిర్వాసిత సంఘం నాయకులు సూకురు రామారావు, మాజీ ఎంపిటిసి ఎరగడ గంగమ్మ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ రహదారి వల్ల తమ గ్రామం నుంచి పోడు భూములు సాగు చేసుకొనేందుకు వెళ్లడానికి గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు వేయడం వల్ల పూర్తిగా తమకు దారుల్లేకుండా పోడు వ్యవసాయం చేసుకోవడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై అధికారులు నిర్వాసితులమైన తమకు ఎటువంటి ఆధారం లేని గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులతో మాట్లాడే తమకు అటవీ భూములకు సాగు నీటి కోసం వెళ్లేందుకు దారులు కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెద్దగెడ్డ జలాశయం నిర్వాసితుల సంఘం నాయకులు కోరాడ ఈశ్వరరావు అటవీ పోడుభూములకు పట్టాలిచ్చిన అధికారులు ముఖ్యంగా ఫారెస్ట్ అధికారులు కలెక్టర్‌తో చర్చించి పోడు భూములకు వెళ్లేందుకు తోవలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. కార్యక్రమంలో జె.పోలయ్య, నిర్వాసిత మహిళలు పాల్గొన్నారు.

కోత దశలో కొండచీపుర్లు

ప్రజాశక్తి - భామిని

ఇంట్లో మాఫ్ స్టిక్, ఎలక్ట్రికల్ వాక్యూమ్ క్లీనర్ ఉన్నా ఇల్లు తుడవడానికి కొండ చీపురు అంటేనే గృహిణులకు ఎంతో ఆసక్తి. కొండ చీపురు దొరికితే భర్తకు తీసుకురండని చెప్పని భార్య ఉండదు. గృహిణులు ఇల్లు తుడవడానికి ఏడాది పొడవునా సరిపడే కొండ చీపుర్లు కొనుక్కుని నిల్వ చేసుకుంటారు. ప్రస్తుతం కొండ చీపురు కోత దశలో ఉంది. మరో పది రోజులు అమ్మకానికి వస్తుంది. ప్రస్తుతం కోసి, ఎండ బెట్టి, కట్టలు కట్టి సిద్ధం చేసిన కొండ చీపురు 50 రూపాయలు పైబడి కొనుగోలు చేస్తేనే గిట్టుబాటు అవుతుంది. ఐటిడిఎ, జిసిసి, వన్ దన్ వికాస కేంద్రాల ద్వారా కొండ చీపుర్లు గిట్టు బాటు ధరకు కొనుగోలు చేయాలని, లేకుంటే దళారులుకు రూ.35 నుండి రూ.40కు అమ్ముకొనే పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు చెబుతున్నారు.

ఏపుగా పెరిగిన కొండ చీపుర్లు

గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

ఒడిస్సా నుంచి ఘాట్ రోడ్డు మీదుగా అక్రమంగా తరలిస్తున్న ఆరు కిలోల గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై పి.నారాయణ రావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం పి.కోనవలస చెక్పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేయగా, ఒడిశాకు చెందిన సానియా జమీ, కేదార్నాథ్ పాత్రో చెక్ పోస్ట్ మీదుగా సాలూరు వైపు సుమారు 6 కిలోల గంజాయితో పట్టుబడ్డరు. గంజాయి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామన్నారు. సాలూరు రూరల్ సిఐ బాలకృష్ణ ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఎస్సై నారాయణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

Government of Andhra Pradesh
Endowments Department

E-PROCUREMENT TENDER NOTICE

Re Construction of Temple of **Sri Ramalayam** at Badevalasa (V), Balijipeta (M), Parvathipuram Manyam District. **NIT NO.P/COE/163/2024-32, Dt.25.01.2024.** For further details log onto website " **https://tender.apeprocurement.gov.in**" for further details contact Ph.9030328967, 8367085591.

EXECUTIVE AUTHORITY
Sri Ramalayam, Badevalasa (V),
Balijipeta (M), Parvathipuram Manyam District